# అమెరికా వచ్చేవారి కోసం.. ప్రత్యేక సెల్: ప్రసాద్ తోటకూర

తిరుపతి, న్యూస్‌టుడే

అమెరికా వెళ్లాలంటే ఆగర్భశ్రీమంతులే కానక్కర్లేదు. పుడతానే ఎవరూ రెక్కలు కట్టుకుని అక్కడ వాలరు. దాని వెనక ఎంతో కృషి ఉంటుంది. ప్రతికదిలికలోనూ పట్టుదల ఉంటుంది. అక్కడ కాలుమోపాక ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కఠోర శ్రమ, క్రమశిక్షణలు ముడిపడి ఉంటాయి. మన తెలుగు తేజం ప్రసాద్ తోటకూర మధ్యతరగతి కుటుంబంలోనే పుట్టారు. ఉపాధికోసం అమెరికా వెళ్లినా.. ఉద్యోగానికే పరిమితం కాలేదు. మన వాళ్లు.. మన కళలు.. మన సంస్కృతి అంటూ.. మాతృ దేశాన్ని, మాతృ భాషను కాపాడుకోవడానికి అహరహం శ్రమిస్తున్నారు.

అమెరికా వచ్చే వారికి సమగ్ర సమాచారాన్ని అందించేందుకు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) కొత్త అధ్యక్షులు ప్రసాద్ తోటకూర వెల్లడించారు. డబ్బుల సంపాదన కోసమే అయితే అమెరికా రానవసరం లేదని చెప్పారు. అంతకంటే ఎక్కువగా ఇక్కడ సాంకేతిక పరిజ్ఞానం పెరిగిందని అమెరికా నుంచే భారత్‌కు వలసలు పెరుగుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికాలో పెరుగుతున్న ప్రవాసాంధ్రుల సంఖ్యతో బాటు.. వృద్ధులు పెరుగుతున్నారని వారి కోసం వృద్ధాశ్రమాన్ని నెలకొల్పాలన్నది తన ఆశయంగా చెప్పారు. తానా ఉత్సవాల్లో చురుకైన పాత్ర నిర్వహించేందుకు మన చంద్రగిరికి అతిథిగా వచ్చిన ప్రసాద్ తోటకూరను 'న్యూస్‌టుడే' పలకరించినప్పుడు ఆయన మాటల్లోనే..

## '86లో అడుగు పెట్టా..

మాది గన్నవరం. కృష్ణాజిల్లా. నాన్న అపరాయవర్మ హిందీపండిట్. మధ్యతరగతి కుటుంబం. స్థానికంగానే కామర్స్‌లో పీజీ చేశా. అక్కడే కాలేజీలో అధ్యాపకుడిగా, వైస్ ప్రిన్సిపాల్‌గా ఏడేళ్లు పనిచేశా. తరవాత అమెరికాలో ఎంబీయేకి దరఖాస్తు చేశా. అర్హత సాధించి.. ఉన్నత విద్య కోసం అలా 1986లో అక్కడ కాలుమోపా. టెక్సాస్‌లోని డేలస్‌లో స్థిరపడ్డాం. ఏక్‌నజర్ ఐటీ కంపెనీలో చీఫ్ ఆపరేటింగు ఆఫీసర్‌గా పనిచేస్తున్నా. నా భార్య స్వరూప రాణి క్యాష్ అమెరికా ఇంటర్నేషనల్‌లో కంప్యూటర్ ప్రోగ్రామర్. అమ్మాయి ప్రశాంతి డాక్టర్..క్యాన్సర్ స్పెషలిస్టు. అబ్బాయి మెడిసిన్ మూడో సంవత్సరం చేస్తున్నాడు.

**తానా భవిష్యత్తు అధ్యక్షుడిగా..** తానాలో కోశాధికారిగా, కార్యదర్శిగా గతంలో బాధ్యతలు నిర్వహించా. భవిష్యత్తు అధ్యక్షుడిగా ఎన్నికయ్యా. వచ్చే ఏడాది జూలై నుంచి 2013 జూలై దాకా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తా. ఎవరైనా ఆ బాధ్యతల్లో ఉండేది ఒకసారే.. రెండేళ్లే. తర్వాత మళ్లీ అవకాశం రాదు.

**తెలుగు పాఠ్యాంశంగా అమెరికన్స్ కూడా..** తెలుగు సంస్కృతి, సాహిత్యం, సమాజసేవ తానా ముఖ్య కార్యక్రమాలు. అక్కడే పుట్టి పెరిగే తెలుగువారి పిల్లలకు తెలుగు భాష, సంస్కృతి నేర్పుతాం. యూనివర్సిటీల్లో తెలుగు కోర్సులు పెట్టించగలిగాం. అమెరికన్స్ కూడా తెలుగు నేర్చుకుంటున్నారు. అక్కడ ఆపదలో ఉన్న ప్రవాసాంధ్రులను ఆదుకోవడంలో తానా ముందుంటుంది. మాతృ దేశం నుంచి కళాకారులను, రచయితలను, సాహితీవేత్తలను ఆహ్వానించి కార్యక్రమాలు ఏర్పాటు చేయడంలో తానా చొరవ తీసుకుంటుంది.

**అక్కడికి వచ్చే వారికోసం..** ఉద్యోగాలకు, ఉన్నత విద్యావకాశాలకు అమెరికాకు వచ్చే వారికి పరిస్థితులను తానా తరఫున విశదీకరిస్తాం. అవకాశాలను బట్టి ప్రోత్సహిస్తాం.

**అర్హత, అనుభవాన్ని బట్టే..** అమెరికాకు రావాలంటే ఎక్కువ కష్టపడాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాలు రావడానికి అవకాశాలు తక్కువ. అర్హత, అనుభవం ఉన్నవారికే అక్కడ అవకాశాలు దక్కుతాయి. ఇక్కడా టెక్నాలజీ పెరిగింది. అమెరికాలో ఉన్న సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయి. ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ తదితర రంగాల్లో అక్కడ స్థిరపడిన వాళ్లు కూడా ఇక్కడికి రావడానికి వత్తిడి తెస్తున్నారు. కేవలం డబ్బుకోసమే అమెరికాకు రావాల్సిన అవసరం లేదు.

**కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలపై..** విజయవాడలో నిర్వహించే ఉత్సవాల్లో తెలుగు సంస్కృతి, కట్టుబాట్లు, అలవాట్లపై రచయితలను ప్రోత్సహించి వ్యాసాలు రాయిస్తున్నాం. వాటికి పుస్తక రూపాన్నివ్వబోతున్నాం.

**ప్రత్యేక సెల్...** అమెరికా వచ్చేవారు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. అధ్యక్షుడిగా జూలై తర్వాత వారికోసం ప్రత్యేక సెల్‌ను



ఉత్సవాల్లో ప్రసాద్‌తోటకూర, విజయ

ఏర్పాటు చేయాలనుకుంటున్నా. వీసాలో సమస్యలు వస్తున్నాయి. యువతకు కౌన్సెలింగులు నిర్వహించబోతున్నాం. తానా వెబ్‌సైట్‌లో ప్రతి విభాగానికి సంబంధించి కమిటీలు ఉన్నాయి. అక్కడసమాచారం తెలుసుకోవచ్చు

**వృద్ధాశ్రమాల ఏర్పాటు..** తెలుగువారి సంఖ్య బాగా పెరుగుతోంది. వారితో బాటు వృద్ధులు పెరుగుతున్నారు. పిల్లలు వత్తిడికి గురవుతున్నారు. వృద్ధులు ఇళ్లల్లో గడపలేకపోతున్నారు. వారికోసం ప్రత్యేక కాంప్లెక్స్ నిర్మాణాలను తలపెట్టాలని యోచిస్తున్నా. అక్కడ ఆ వయసు వారంతా కలిసి ఉండటం వల్ల పరస్పరం.. బాధ్యతలు, సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు వీలుంటుంది.